సాక్షి ప్రకాశం
ఆదివారం | 6 | జూలై | 2025



రైతులపై బీమా భారం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత పంటల బీమా అమలు చేయగా, కూటమి ప్రభుత్వం ఈ పథకానికి ఫుల్‌స్టాప్ పెట్టింది.

- 8లో..



పురివిప్పిన పాత కక్షలు.. వ్యక్తి దారుణ హత్య

పెద్దదోర్నాల మండలం నల్లగుంట్లలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు.

- 8లో..

గరిష్టం/కనిష్టం 36/27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్


కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు

ఒంగోలు సబర్బన్: నగరంలోని సంతపేట పశు వైద్యశాలలో ఆదివారం ఉచితంగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేయనున్నట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి బి.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పెంపుడు కుక్కలకు ఉదయం 9 గంటలకు వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఈ అవకాశాన్ని పెంపుడు కుక్కల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాలుట్లపై కన్నేసిన పెద్దపులి

- మరోసారి పశువులపై దాడికి యత్నం

యర్రగొండపాలెం: మండలంలోని పాలుట్లపై పెద్దపులి కన్నేసింది. మరోసారి పశువులపై దాడి చేసేందుకు ప్రయత్నించింది. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత గ్రామ వెలుపల ఉన్న పశువుల కొష్టాలవద్దకు వచ్చిన పులి అదునుకోసం వేచి చూసింది. పులి కదలికలను గుర్తించిన ఆవులు కొష్టాల నుంచి బయటికి వచ్చి గ్రామంలోకి చేరాయని ఆ గ్రామస్తులు తెలిపారు. పరిస్థితిని గమనించిన పాలుట్ల తండా వాసులు కేకలు పెట్టుకుంటూ అక్కడికి వెళ్లడంతో పులి గుప్‌చుప్‌గా అడవిలోకి ఉడాయించిది. గత నెల 12వ తేదీ నుంచి పెద్దపులి నాలుగు పర్యాయాలు పశువులపై దాడి చేసి రెండు ఎద్దులు, రెండు ఆవులను హతమార్చింది. మరో ఆవును తీవ్రంగా గాయపరిచింది. పులి వరుసగా తమ పశువులపై దాడులు చేస్తుండటంతో గిరిజనులు ఆందోళనకు గురవుతున్నారు. పశువులను మేపుకోవటానికి పొలాల్లోకి వెళ్లలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీ శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



మద్దతు ధరలేదు..కొనుగోళ్లు అంతంతమాత్రమే..డబ్బుల కోసం నెలలుగా ఎదురుచూపులు..ఇదీ ధాన్యం రైతుల దుస్థితి. ఆరుగాలం రైతు కష్టపడి పండించిన పంటకు కనీస గిట్టుబాటు ధర లభించక అన్నదాత బేల చూపులు చూస్తున్నాడు. సర్కార్ దగా చేయడంతో పండించిన పంటను దళారులకు తెగనమ్ముకుంటున్నాడు. ఖరీఫ్, రబీ సీజన్లు కలుపుకుని వచ్చిన దిగుబడుల్లో కనీసం పదిశాతం కూడా కొనుగోలు చేయలేదు. కొనుగోలు చేసిన వాటికి 24 గంటల్లో చెల్లింపులు చేస్తున్నామని సీఎం చంద్రబాబు దగ్గర నుంచి మంత్రులు వరకూ ప్రకటనలు చేస్తున్నారు. వాస్తవానికి జిల్లాలో రైతులకు రావాల్సిన రూ. 3 కోట్ల బకాయిల కోసం రెండు నెలలుగా ఎదురుచూస్తున్నారు

- అడుగడుగునా ధాన్యం రైతు దగా
- బకాయిలు రూ. 3 కోట్ల కోసం ఎదురు చూపులు
- జిల్లాలో ఖరీఫ్, రబీల్లో ధాన్యం దిగుబడి 1.20 లక్షల టన్నులు
- నిర్దేశించిన లక్ష్యం 27 వేల టన్నులు
- కొనుగోలు చేసింది 15 వేల టన్నులు మాత్రమే
- మద్దతు ధర రాక దళారులకు తెగనమ్ముకున్న అన్నదాతలు
- రైతుల గోడుపట్టని కూటమి ప్రజాప్రతినిధులు

రైతు దగాపడి.. కష్టం బకాయిపడి!

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

కూటమి ప్రభుత్వంలో రైతు పరిస్థితి దారుణంగా ఉంది...రైతు భరోసా సాయం లేదు...పంటల బీమా అంతకంటే లేదు..కనీసం ఆరుగాలం రైతు కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక అన్నదాతలు అల్లాడిపోతున్నాడు. ఇక ధాన్యం రైతు పరిస్థితి వర్ణణాతీతం. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన ఏడాది కాలంగా సకాలంలో వర్షాలు లేవు. అంతంతమాత్రంగానే సాగర్ జలాలు.. ఇలా ప్రతికూల పరిస్థితుల్లో ధాన్యం సాగు చేస్తే ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తుందనుకుంటే అదీకూడా లేదు. బహిరంగ మార్కెట్‌లో తాలు...తేమ...గోతాలు అంటూ ధరను దిగకోసి క్వింటా రూ.1100 నుంచి రూ.1250 వరకు ఇచ్చే సరికి గగనమవుతోంది.

ధాన్యం దిగుబడి 1.20 లక్షల మెట్రిక్ టన్నులు

జిల్లాలో 2024 ఖరీఫ్, 2024–25 రబీ సీజన్‌లో రెండు సీజన్లు కలుపుకొని 1.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. ఖరీఫ్‌లో 14,078 ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉంది. అయితే ప్రతికూల పరిస్థితుల్లో దాదాపు 10 వేలకు పైగా ఎకరాల్లో వరి సాగు చేశారు. దాంతో దాదాపు 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయింది. అదేవిధంగా 2024–25 రబీ సీజన్‌లో సాధారణంగా 21,669 ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా కేవలం 15 వేలకు పైగా ఎకరాల్లో పండించారు. దాదాపు 70 వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం దిగుబడి వచ్చింది.

నామమాత్రంగా కొనుగోళ్లు

పంట విస్తీర్ణం తగ్గింది. దానికి తోడుగా ధాన్యం దిగుబడులు కూడా దిగనాశిగా తయారయ్యాయి. అయినా దళారులు కూటమి కట్టి బహిరంగ మార్కెట్‌లో ధాన్యానికి ధర లేకుండా చేశారు. బియ్యం ధరలు చూస్తే ఆకాశాన్నంటుతున్నాయి. కానీ రైతు పండించిన పంట వరకు వచ్చే సరికి ధర మాత్రం కిందిచూపు చూస్తోంది. జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లు కలుపుకొని 1.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయితే కనీసం సగానికి సగం అయినా కొనుగోలు చేస్తారనుకుంటే రైతుల ఆశలపై నీళ్లు చల్లింది రాష్ట్ర ప్రభుత్వం. ప్రభుత్వ పెద్దలు చెప్పే దానికి చేసే దానికి పొంతన లేకుండా పోతోంది. తొలుత ఖరీఫ్ సీజన్‌లో 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని ఆశలు చూపి 10 వేల మెట్రిక్ టన్నులకు ఆ లక్ష్యాన్ని కుదించింది. చివరకు కొనుగోలు చేసింది మాత్రం 8,879 మెట్రిక్ టన్నులు మాత్రమే. రబీ సీజన్‌లో కూడా 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్ణయించింది. దానిని 7 వేల మెట్రిక్ టన్నులకు కుదించి 6,323 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసింది.

ధాన్యం బకాయిలు రూ.3 కోట్లు...

జిల్లాలోని రైతాంగానికి ధాన్యం బకాయిలు దాదాపు రూ.3 కోట్లు మేర ఉన్నాయి. ఆరుగాలం కష్టించి ధాన్యాన్ని పండిస్తే కొనుగోలు చేసిన ప్రభుత్వం నెలల తరబడి ధాన్యం సొమ్ము రైతులకు వేయకుండా ఇబ్బందుల పాలు చేస్తోంది. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాలకు జమ అవుతాయని చెప్పిన పాలకులు ఎందుకు డబ్బులు వేయలేకపోతున్నారన్న అనుమానాలు రైతుల్లో నెలకొన్నాయి. ఖరీఫ్ సీజన్‌లో మొత్తం రూ.20.59 కోట్లకు కొనుగోలు చేస్తే రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు ప్రారంభించే సమయానికి కూడా ఖరీఫ్ రైతులకు ధాన్యం సొమ్ము చెల్లించలేదు. రబీ ధాన్యం కొనుగోలు చేయటం ప్రారంభించిన తరువాత నిదానంగా రైతులకు చెల్లించారు. రబీ సీజన్‌లో ధాన్యానికి సంబంధించి ఇంకా రూ.3 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉంది. రైతులు ధాన్యం అమ్మి దాదాపు రెండు నెలలు గడుస్తున్నా ఖాతాల్లో డబ్బులు చెల్లించలేదు.

జిల్లా కొనుగోలు లక్ష్యాన్ని ఉభయ గోదావరి జిల్లాలకు మళ్లింపు..

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల లక్ష్యాలను ప్రభుత్వం కుదించింది. జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా ఇక్కడ కేటాయించిన లక్ష్యాలను ఉభయ గోదావరి జిల్లాలకు మళ్లించింది. తొలుత ఖరీఫ్ 15 వేల మెట్రిక్‌టన్నులు కొనుగోలు చేస్తామని చెప్పి కేవలం 8,879 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసి మిగిలిన 6,121 మెట్రిక్ టన్నులను ఉభయ గోదావరి జిల్లాలకు మళ్లించారు. రబీలో కూడా 15 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తామని చెప్పి 8,758 మెట్రిక్ టన్నులను ఉభయ గోదావరి జిల్లాలకు మళ్లించారు. రైతు ఇంత దారుణంగా మోసపోతున్నా కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు ఇదేంటని అడిగిన పాపాన పోలేదు.

ధాన్యం బకాయిలు రూ.3 కోట్లు

జిల్లాలో ధాన్యం పండించిన రైతులకు దాదాపు రూ.3 కోట్ల బకాయిలు ఉన్నాయి. మొదట్లో 48 గంటల్లోనే రైతుల బ్యాంకు అకౌంట్లకు డబ్బులు జమచేశాం. అయితే చివర్లో చెల్లింపులు కొంత ఆలస్యమైన మాట వాస్తవం. ఖరీఫ్‌లో కూడా రైతులకు చెల్లింపులు కొంత మేర ఆలస్యమయ్యాయి. రబీ కొనుగోళ్ల ప్రారంభం అయ్యే నాటికి ఖరీఫ్ బకాయిలను ప్రభుత్వం చెల్లించింది. తొలుత జిల్లాకు కొనుగోలు లక్ష్యాలు ఇచ్చి తరువాత కొంతమేర తగ్గించారు.

– జి.వరలక్ష్మి, జిల్లా పౌరసరఫరాల కార్పొరేషన్ మేనేజర్

మెడికల్ సీట్లు వద్దనడం సిగ్గుచేటు

- వైద్య విద్యను పేద విద్యార్థులకు దూరం చేసేందుకు కూటమి కుట్రలు
- ప్రైవేట్ విద్యాసంస్థలకు దోచిపెట్టేందుకే పీపీపీ విధానం
- వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పల్నాటి రవీందర్‌రెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పల్నాటి రవీందర్‌రెడ్డి

ఒంగోలు సిటీ: ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా మెడికల్ సీట్లు పెంచమని కోరతారని, కానీ ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం మెడికల్ సీట్లు వద్దని కేంద్రానికి లేఖ రాయడం సిగ్గు చేటని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పల్నాటి రవీందర్‌రెడ్డి ధ్వజమెత్తారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పులివెందుల, మార్కాపురం, మదనపల్లె, పాడేరు, ఆదోని వైద్య కళాశాలలు 750 సీట్లతో ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నా కూడా కూటమి ప్రభుత్వం నేషనల్ మెడికల్ కమిషన్‌కు ఆ సీట్లను రద్దు చేయమని లేఖ రాయడం దారుణమన్నారు. మెడికల్ కళాశాలలు నిర్మాణంలో ఉన్న పిడుగురాళ్ల, పెనుకొండ, పాలకొల్లు, నర్సీపట్నం, పార్వతీపురం, బాపట్ల, అమలాపురం కళాశాలలన్నీ కూటమి ప్రభుత్వం నిర్ణయంతో 1800 ఎంబీబీఎస్ సీట్ల వరకు మన విద్యార్థులు నష్టపోయారని ధ్వజమెత్తారు. అదేమని అడిగితే దేశంలోని అనేక రాష్ట్రాల్లో పీపీపీ విధానం అమలవుతుందని సీఎం చంద్రబాబు చాలా తెలివితక్కువగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఆయా రాష్ట్రాల్లో కొత్త మెడికల్ కళాశాలలకు మాత్రమే పీపీపీ విధానాన్ని అమలు చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలే వేలకోట్లు వెచ్చించి నిర్మించిన వైద్య కళాశాలలకు పీపీపీ విధానం అమలు చేయలేదన్న వాస్తవాన్ని పాలకులు గుర్తెరగాలన్నారు. కేవలం భూములు మాత్రమే లీజుకి ఇచ్చి ప్రైవేట్ ద్వారా కళాశాలలు నెలకొల్పేలా ఆయా ప్రభుత్వాలు చర్యలు చేపట్టారన్నారు. 80 శాతం పూర్తయిన కళాశాలలకు చిన్న చిన్న సదుపాయాలు కల్పిస్తే ఎంబీబీఎస్ తరగతులను ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నాయని, కానీ సీఎం చంద్రబాబు మాత్రం ప్రైవేట్ వ్యక్తులకు దారాదత్తం చేయడానికి కుట్ర పన్నారన్నారు. పేద విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేసే ఈ కుట్రలు, కుతంత్రాలకు తక్షణమే స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. విద్యార్థులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం మనుగడ సాగించిన దాఖలాలు చరిత్రలో లేవన్న వాస్తవాన్ని గమనించి ఇకనైనా కార్పొరేట్ శక్తుల కొమ్ము కాయడం మానుకోవాలని హితవు పలికారు.

పేద విద్యార్థులకు తీరని అన్యాయం

ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే సీఎం చంద్రబాబు ఎవరికీ అనుమానం రాని రీతిలో పీపీపీ విధానం అంటూ కొత్త పాట పాడడం ప్రారంభించారన్నారు. ఈ పీపీపీ విధానం వైద్య కళాశాలలో అమలు చేయడం వల్ల కొన్ని వందల మంది మెరిట్ విద్యార్థులకు ఎంబీబీఎస్ విద్య దూరమవుతుందని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మెడికల్ కళాశాలను 100 శాతం ప్రభుత్వ కళాశాలలుగా కొనసాగిస్తామని తొలుత హామీ ఇచ్చారని, కానీ సీఎం చంద్రబాబు మాత్రం నారాయణ మెడికల్ కళాశాల వంటి ప్రైవేట్ విద్యాసంస్థలకు దోచి పెట్టేందుకే పీపీపీ విధానాన్ని తీసుకువచ్చారన్న వాస్తవం అందరికీ తెలిసిందేనన్నారు. వైద్య కళాశాలలన్నీ పూర్తిగా కార్పొరేట్‌శక్తుల పరమై రాష్ట్రంలో పేద మెరిట్ విదాజ్యర్థులకు ఎంబీబీఎస్ విద్య కలగానే మిగిలిపోతుందన్నారు. ప్రభుత్వ కళాశాలలు ఏర్పడితే కొన్ని వందల పడకలతో కూడిన ప్రభుత్వ ఆసుపత్రి కూడా ఏర్పడుతుందని, తద్వారా లక్షల మంది పేద ప్రజలకు ఉచిత వైద్యం అందుతుందన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలు మేం నడపలేమని వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ సిగ్గు లేకుండా ప్రకటించిన నేపథ్యంలో అటు పేద విద్యార్థులు వైద్య విద్యకు, ఇటు పేద ప్రజలు వైద్య సేవకు దూరమవుతున్నారని విమర్శించారు. విలువైన ప్రజాధనం, ప్రభుత్వ ఆస్తులను నిలువు దోపిడీ చేయడం కోసమే కూటమి ప్రభుత్వం పీపీపీ స్కీమ్ పేరిట భారీ స్కాము శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం అంటూ ప్రభుత్వ సంస్థలను తమవారికి కారు చౌకగా తెగనమ్మే కుట్రకు కూటమి ప్రభుత్వం తెరలేపిందని ధ్వజమెత్తారు. సమావేశంలో విద్యార్థి విభాగం ఒంగోలు నియోజకవర్గ అధ్యక్షుడు వేముల శ్రీకాంత్, ఒంగోలు నగర విద్యార్థి విభాగం అధ్యక్షుడు సయ్యద్ ఖాదర్ బాషా, యూత్‌జాయింట్ సెక్రటరీ ముల్లంగి రవీంద్రారెడ్డి, పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, తిరుపతిరెడ్డి, సిద్దారెడ్డి, వాసు, నాని, రవి తదితరులు పాల్గొన్నారు.

ముప్పా ఇంట్లోనే హత్యకు ప్లాన్..?

- ముప్పా సురేష్ భార్యకు నోటీసులు
- కొలిక్కి వస్తున్న హత్య కేసు

ఒంగోలు టౌన్:



టీడీపీ నాయకుడు వీరయ్య చౌదరి హత్యకు బంగారు వ్యాపారి ముప్పా సురేష్ ఇంట్లోనే పథక రచక చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు వీరయ్య చౌదరి హత్యతో తనకు ఎలాంటి సంబంధం లేదని ముప్పా సురేష్ వాదిస్తున్న సంగతి తెలిసిందే. హైదరాబాద్‌లో నివాసం ఉండే సురేష్...వీరయ్య హత్య జరిగినప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. ఆయన కోసం పోలీసులు హైదరాబాద్ చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అయినా పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్న ముప్పా సురేష్.. కేసు దర్యాప్తులో ఉన్న సమయంలో తనకు వీరయ్య చౌదరి హత్యతో ఎలాంటి సంబంధం లేదని ఒక టీవీ చానెల్‌కు వాయిస్ పంపించాడు. అంతకు ముందు అదే టీవీ చానెల్లో ఆయన సతీమణి అనితతో ఇంటర్వ్యూ ప్రసారం చేసింది. ఆమె కూడా వీరయ్య చౌదరి హత్యతో తన భర్తకు ఎలాంటి సంబంధం లేదని వాదించారు. ఆ తరువాత ఈ కేసులో అరెస్టు కాకుండా ఉండేందుకు ముందస్తు బెయిల్ కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

పోలీసుల విచారణలో వాస్తవాలు వెలుగులోకి..

వీరయ్య చౌదరి హత్య జరిగి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ముప్పా సురేష్‌ను అరెస్టు చేయకపోవడంపై పోలీసులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్న ముప్పా సురేష్ టీవీ చానెల్‌కు వాయిస్ ఎక్కడ నుంచి పంపించాడన్న ప్రశ్న తలెత్తుతోంది. న్యాయస్థానంలో బెయిల్ కోసం ప్రయత్నిస్తున్న సురేష్ పోలీసుల కంట పడకపోవడమేంటని పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో ముప్పా సురేష్ వ్యవహారం పోలీసులకు సవాల్‌గా మారింది. ఈ క్రమంలో వీరయ్య చౌదరి హత్య కేసులో అరెస్టై జైలులో ఉన్న బోర్లగుంట వినోద్‌కుమార్, ఓబిలి నాగరాజు, ఆళ్ల సాంబశివరావు, గోళ్ల రుత్యేంద్రబాబులను గత నెల 24 నుంచి 27వ తేదీ వరకు పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. మూడు రోజుల పాటు అనేక కోణాల్లో విచారించారు. ముఖ్యంగా వీరయ్య చౌదరి హత్య కేసులో ముప్పా సురేష్ పాత్ర గురించి లోతుగా విచారించగా అసలు విషయం బయటకు వచ్చిందని సమాచారం.

విచారణలో కీలక సమాచారం

హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్న బోర్లగుంట వినోద్ కుమార్, ఆళ్ల సాంబశివరావులను విచారించిన సమయంలో హైదరాబాద్‌లోని ముప్పా సురేష్ నివాసంలోనే వీరయ్య చౌదరి హత్యకు పథక రచన జరిగిందని నిందితులు పోలీసు విచారణలో చెప్పినట్లు ఎస్పీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటన బట్టి అర్థం అవుతుంది. హత్య గురించి ముప్పా సురేష్ , వినోద్‌కుమార్, సాంబయ్యలు మాట్లాడుకుంటున్న సమయంలో సురేష్ కుటుంబసభ్యులు కూడా అక్కడే ఉన్నట్లు నిందితులు తెలిపినట్లు వివరించారు. దీంతో రాష్ట్రంలో సంచలనం సృష్టించిన టీడీపీ నాయకుడు వీరయ్య చౌదరి హత్య కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది.

ముప్పా సురేష్ సతీమణికి నోటీసులు..

కేసు దర్యాప్తులో భాగంగా ముప్పా సురేష్ సతీమణి అనితకు శనివారం బీఎన్ఎస్ఎస్ నోటీసులను జారీ చేసినట్లు జిల్లా ఎస్పీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. అంతేకాకుండా వీరయ్య చౌదరి హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఓబిలి నాగరాజును జిల్లా జైలులో నిర్వహించిన పరేడ్‌లో ప్రత్యక్ష సాక్షులు గుర్తించినట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఒంగోలు 2 ఏఎంఎం కోర్టు మేజిస్ట్రేట్ పర్యవేక్షణలో జైలులో పరేడ్ నిర్వహించినట్లు వివరించారు. ఈ క్రమంలో వీరయ్య హత్య కేసు కొలిక్కివచ్చినట్లేనని చెప్పవచ్చు.



కక్షిదారులతో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ భారతి

లోక్ అదాలత్‌లో 5,300 పైగా కేసుల పరిష్కారం

ఒంగోలు: జాతీయ లోక్ అదాలత్‌లో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అన్ని కోర్టుల్లో 5300కు పైగా కేసులు పరిష్కారమయ్యాయని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ భారతి పేర్కొన్నారు. జిల్లాలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 27 బెంచీల ద్వారా పరిష్కారమైన కేసుల వివరాలను ఒక ప్రకటనలో వెల్లడించారు. 5200కుపైగా క్రిమినల్ కేసులు, 155 సివిల్ దావాలతో పాటు 17 ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కరించారు. మోటార్ వాహన ప్రమాద బీమా తదితర కేసుల్లో రూ.8 కోట్లకు పైగా కక్షిదారులకు పరిష్కార చెల్లింపులు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి బెంచీలో న్యాయమూర్తితో పాటు న్యాయవాదులు సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారన్నారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం సహకరించిన న్యాయవాదులకు, పోలీసులకు, వివిధ ప్రభుత్వ శాఖల ప్రతినిధులకు, బ్యాంకు అధికారులకు, బీమా సంస్థల ప్రతినిధులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అభినందనలు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్ తదితరులు నిరంతరం పర్యవేక్షించారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ కమిటీల్లో

జిల్లా నేతలకు పెద్దపీట

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన నాయకులను రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో వివిధ హోదాల్లో నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర విద్యార్థి విభాగం జాయింట్ సెక్రటరీగా సంతనూతలపాడుకు చెందిన పాలపర్తి ప్రవీణ్‌చంద్, వలంటీర్ విభాగం జోనల్ ప్రెసిడెంట్‌గా యర్రగొండపాలెంకు చెందిన దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, సెక్రటరీగా కొండపికి చెందిన రావులపల్లి రామకృష్ణ, వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీగా కొండపికి చెందిన బి.మనోహర్, ఆర్టీఐ వింగ్ సెక్రటరీగా కొండపికి చెందిన పిల్లి తిరుపతిరెడ్డి, ప్రచార విభాగం జనరల్ సెక్రటరీగా ఒంగోలుకు చెందిన కఠారి శివప్రసాద్, సెక్రటరీగా కొండపికి చెందిన కునం నరేంద్రరెడ్డి, పంచాయతీరాజ్ విభాగం ఉపాధ్యక్షుడిగా యర్రగొండపాలెంకు చెందిన భూమిరెడ్డి పెద్దసుబ్బారెడ్డి, జాయింట్ సెక్రటరీగా కొండపికి చెందిన పల్లపోలు బాలకోటిరెడ్డి, వైఎస్సార్‌టీయూసీ జనరల్ సెక్రటరీగా కొండపికి చెందిన చొప్పర వెంకటేశ్వర్లు, సెక్రటరీలుగా దర్శికి చెందిన ఎస్‌కేసైదా, సంతనూతలపాడుకు చెందిన పులి వెంకటరెడ్డి, జాయింట్ సెక్రటరీగా మార్కాపురానికి చెందిన బట్టగిరి తిరుపతిరెడ్డిలను నియమించినట్లు పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

రాష్ట్ర సంయుక్త కార్యదర్శుల నియామకం

కొండపికి చెందిన బొగ్గుల శ్రీనివాసరెడ్డి, సంతనూతలపాడుకు చెందిన వేమా శ్రీనివాసరావు, దర్శికి చెందిన పోసం మధుసూదన్‌రెడ్డిలను రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలి

- ఎస్పీ ఏఆర్ దామోదర్

పొన్నలూరు: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శనివారం రాత్రి ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలు, రికార్డులను తనిఖీ చేసి పలు అంశాలపై పోలీసులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో శాంతిభద్రతలపై, నేర నివారణ వ్యూహాలపై నిత్యం సమీక్ష చేసుకోవాలన్నారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన దర్యాప్తు చేపట్టి పరిష్కరించాలన్నారు. రాత్రిళ్లు గస్తీ ముమ్మరం చేసి నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బెల్ట్ షాపులు, పేకాటపై గట్టి చర్యలు తీసుకోవాలని చెప్పారు. నేర ప్రవర్తన కలిగిన వారి కదిలికలపై ప్రత్యేక నిఘా ఉంచి విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, కొండపి సీఐ సోమశేఖర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాండురంగారావు ఉన్నారు.


టంగుటూరు: చట్ట వ్యతిరేక కార్యకలాపాల కట్టడికి చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ ఆవరణ, గదులు, రికార్డులు పరిశీలించారు. స్టేషన్ నిర్వహణ రికార్డులు, పట్టుబడిన ద్విచక్ర వాహనాలు, ఇతర వస్తువులు తనిఖీ చేసి వాటిని త్వరగా డిస్పోజల్ చేయాలని ఆదేశించారు. పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకొని వాటిని త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. ఫిర్యాదుల స్వీకరణ, కేసుల నమోదులో ఎలాంటి జాప్యం ఉండరాదన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ఎస్సై నాగమల్లేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.



టంగుటూరు పోలీస్‌స్టేషన్ తనిఖీ చేస్తున్న ఎస్పీ దామోదర్

■ కష్టం, నష్టం మీదే..

రైతులపై బీమా భారం.. 53,00,00,000



● కూటమి ప్రభుత్వంలో అడ్రస్ లేని ఉచిత పంటల బీమా
● ఇప్పటి వరకూ రైతుల ఖాతాల్లో పడని 'అన్నదాత సుఖీభవ' సాయం
● జిల్లాలో 7 పంటలకే పంటల బీమా అమలు


మార్కాపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సంక్షేమాన్ని గాలికొదిలేసింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత పంటల బీమా అమలు చేయగా, కూటమి ప్రభుత్వం గద్దెనెక్కగానే ఈ పథకానికి ఫుల్ స్టాప్ పెట్టింది. దీంతో గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులకు పైసా పరిహారం అందలేదు. ఇదిలా ఉండగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా కింద అందించే పెట్టుబడి సాయాన్ని కూటమి ప్రభుత్వం గత ఏడాది ఎగ్గొట్టింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ నిధులు జమ చేయలేదు. దీంతో రైతులు పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ ఏడాది పంటల బీమాను అమలు చేస్తున్నట్లు ప్రకటించిన కూటమి ప్రభుత్వం.. ప్రీమియం భారాన్ని రైతులే మోయాలని తేల్చిచెప్పింది.

బీమా వర్తించేది వీటికే..

ఈ ఏడాది జిల్లాలో మొత్తం 4,62,944 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖాధికారులు అంచనా వేశారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను జిల్లాలో 7 పంటలకు మాత్రమే వర్తింపజేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి, కంది, సజ్జ, మిర్చి, మినుము, నూగులు, పత్తి పంటకు మాత్రమే పరిహారం చెల్లిస్తామని సర్కారు పేర్కొనడంతో మిగిలిన పంటల సంగతేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

రైతులపై పడే భారమిలా..

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద రైతులు ఈ ఏడాది పంటలకు ప్రీమియం కడితేనే ఏదైనా విపత్తు సంభవించినప్పుడు నష్ట పరిహారం వర్తిస్తుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు రూపాయి ఖర్చులేకుండా ప్రభుత్వమే ఆ భారాన్ని భరించి ఉచిత పంటల బీమాను అమలు చేసింది. కూటమి ప్రభుత్వం మాత్రం రైతులపై ఆర్థిక భారం మోపి పక్కకు తప్పుకోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.



■ వరి 12,826 హెక్టార్లలో సాగు కానుండగా హెక్టారుకు రూ.2150 ప్రకారం రూ.2,75,75,900 రైతులు చెల్లించాలి.



■ వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం పత్తి 26,981 హెక్టార్లలో సాగు చేయనుండగా హెక్టారుకు రూ.5,250 ప్రకారం రూ.14,16,50,250 పత్తి రైతులు ప్రీమియంగా చెల్లించాలి.



■ సజ్జ 7020 హెక్టార్లలో సాగు కానుండగా హెక్టారుకు రూ.390 ప్రకారం రూ.27,37,800 ప్రీమియంగా చెల్లించాలి.



■ మినుము 2,456 హెక్టర్లలో సాగు చేయనుండగా హెక్టారుకు 512.50 ప్రకారం రూ.12,58,700 ప్రీమియంగా చెల్లించాలి.



■ మిర్చి 25,217 హెక్టార్లలో సాగు కానుండగా హెక్టారుకు రూ.11,250 ప్రకారం రూ.28,36,91,250ను ప్రీమియంగా చెల్లించాలి.



■ నువ్వులు 3,457 హెక్టార్లలో సాగు చేయనుండగా హెక్టారుకు రూ.450 ప్రకారం రూ.15,55,650 చెల్లించాలి.



■ కంది 68,687 హెక్టార్లలో సాగు కానుండగా హెక్టారుకు రూ.1075 ప్రకారం రూ.7,34,08,525 ప్రీమియంగా చెల్లించాలి.

పురివిప్పిన పాత కక్షలు.. వ్యక్తి దారుణ హత్య

● పెద్దదోర్నాల మండలం నల్లగుంట్లలో ఘటన
● హతుడు గతంలో హత్య కేసులో నిందితుడు
● గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు

పెద్దదోర్నాల: ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలం నల్లగుంట్లలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. డీఎస్పీ నాగరాజు కథనం మేరకు.. 2022 ఫిబ్రవరి 9వ తేదీన కొర్రప్రోలు సమీపంలో జరిగిన మొద్దు వెంకటేశ్వర్లు హత్య కేసులో గ్రామానికి చెందిన బైరబోయిన వెంకటేశ్వర్లు ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. ఈ నేపథ్యంలో ప్రత్యర్థి వర్గానికి చెందిన వ్యక్తులు కక్షతో రగిలిపోతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి గ్రామంలో మొహర్రం వేడుకల సందర్భంగా బాదుల్లా షరగత్‌ను నిర్వహించారు. ఇదే అదునుగా భావించిన ప్రత్యర్థి వర్గీయులు అర్ధ రాత్రి సమయంలో కాపు కాసి వెంకటేశ్వర్లుపై కత్తులతో చేసిన దాడి కిరాతకంగా నరికి హత్య చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. హతుడి భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గ్రామంలో పోలీస్ పికెట్

వెంకటేశ్వర్లు దారుణ హత్యకు గురవడంతో ఆయన కుటుంబం శోక సముద్రంలో మునిగింది. భార్య విజయలక్ష్మి భర్త మృతదేహంపై పడి బోరున విలపించటం అందరినీ కలిచి వేసింది. మృతునికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనతో గ్రామంలో స్పెషల్ పార్టీ పోలీసులతో పికెట్ ఏర్పాటు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

నేడు తుమ్మలచెరువులో పెద్ద షహాదత్

తర్లుపాడు: మొహర్రం వేడుకల్లో భాగంగా ఆదివారం తుమ్మలచెరువులో పెద్ద షహాదత్ నిర్వహించనున్నారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ ఉత్సవాలను హిందూ, ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దర్గాలో కొలువైన పెద్ద ఖాశీం స్వామి, చిన్న ఖాశీం స్వాములను దర్శించుకునేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పీర్ల మకాన్, దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు. శనివారం రాత్రి అగ్ని గుండం మండించారు. తెల్లవారుజామున స్వామివారిని గ్రామంలో ఊరేగిస్తారు. కాగా, ఆర్టీసీ ఆధ్వర్యంలో తరుమ్మలచెరువుకు ప్రత్యేక బస్సులు, దర్గా కమిటీ ఆధ్వర్యంలో అన్న సంతర్పణకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పొదిలి సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు.



దర్గాలో కొలువైన పీర్లు

ఏరులై పారుతున్న మద్యం

పెద్ద షహాదత్ సందర్భంగా ఖాశీం స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో వస్తుండటంతో మార్కాపురానికి చెందిన సిండికేట్ నాయకుడు తన మనుషుల ద్వారా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసి అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నాడు. ఎక్సైజ్, పోలీసు అధికారులు అటువైపు కూడా కన్నెత్తి చూడకపోవడంతో ఇష్టానుసారంగా ధరలు పెంచి సొమ్ము చేసుకుంటున్నారు.

పేరెంట్స్ మీటింగా.. డాక్యుమెంటరీనా?

● మౌలిక వసతుల మీద మాట్లాడటానికి 17 రకాల కమిటీలా?
● విట్నెస్ అధికారి నియామక ఉత్తర్వులు రద్దు చేయాలి
● యూటీఎఫ్ ప్రకాశం జిల్లా శాఖ డిమాండ్

ఒంగోలు సిటీ: ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో నిర్వహించే మెగా పేరెంట్స్ మీటింగ్(పీటీఎం)లో విట్‌నెస్ అధికారిని పాఠశాల హెడ్మాస్టర్ నియమించుకొని, వారితో వీడియోలు తీయించి అప్లోడ్ చేయాలని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ హై, డి.వీరాంజనేయులు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థుల విద్యాభివద్ధి, పాఠశాలలో మౌలిక వసతుల మీద మాట్లాడటానికి 17 రకాల కమిటీలు, ఫొటోలు, అప్లోడ్లు, విట్‌నెస్ అధికారి ఇంత తతంగం అవసరమా అని ప్రశ్నించారు. పేరెంట్స్ మీటింగ్‌ను డాక్యుమెంటరీ కార్యక్రమంగా మార్చడం సరికాదన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి గురించి చర్చించే కార్యక్రమంగా దాన్ని మార్చాలని కోరుతున్నామన్నారు. బోధనకు మాత్రమే ఉపాధ్యాయులను పరిమితం చేస్తామని చెప్పిన పాఠశాల విద్యాశాఖ అందుకు భిన్నంగా బోధనేతర పనులకు వినియోగిస్తోందని విమర్శించారు.

ఆప్షనల్ హాలిడేలో కులమతాలేమిటి?

ప్రజలంతా కలిసి మెలిసి నిర్వహించుకునే పండగల ఆప్షనల్ హాలిడేస్‌ను రాష్ట్ర విద్యాశాఖ అధికారులు కులాలు, మతాలవారీగా విభజించడం రాజ్యాంగానికి తూట్లు పొడవడటమే అని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విమర్శించారు. శనివారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మొహర్రం పండగ సందర్భంగా ఈనెల 5వ తేదీ ప్రకటించిన ఆప్షనల్ హాలిడేను కొందరు ఉపాధ్యాయులకే పరిమితం చేయడాన్ని తప్పుబట్టారు. విద్యార్థుల్లో కొందరికి సెలవు ఇచ్చి, మరి కొందరిని పాఠశాలకు రావాలనడం బాలల హక్కులను హరించడం కాదా అని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు స్కూల్ యూనిట్‌గా సెలవు మంజూరు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

12, 13న బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: ఈనెల 12, 13వ తేదీల్లో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జేఎస్ లక్ష్మణ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-11,13,15,17,19 విభాగాల బాలబాలికలతోపాటు సీనియర్ మహిళలు, పురుషుల విభాగంలో క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు తమ ఒరిజినల్ ఆధార్‌కార్డు, వయసు ధ్రువీకరణ పత్రంతో ఈనెల 10వ తేదీలోగా 9398260109ను సంప్రదించాలని సూచించారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఉచిత భోజన వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మార్కాపురంలో ఇద్దరు యువకుల ఆత్మహత్య



చెన్నకేశవులు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సైదుబాబు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని జవహర్ నగర్ కాలనీలో వేర్వేరు కుటుంబాలకు చెందిన ఇద్దరు యువకులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఓ యువకుడు ఉరేసుకుని తనువు చాలించగా, మరో యువకుడు పురుగు మందు తాగి చికిత్స పొందుతూ మరణించాడు. పట్టణ ఎస్సై సైదుబాబు కథనం మేరకు.. పెద్దారవీడు మండలం ఎస్.కొత్తపల్లికి చెందిన వెన్నం రాంబాబు(24) తన కుటుంబ సభ్యులతో కలిసి మార్కాపురంలోని జవహర్‌నగర్ కాలనీలో నివాసముంటున్నాడు. ఆయన తండ్రి ఒక అపార్టుమెంటులో వాచ్‌మెన్. కుటుంబ సమస్యల నేపథ్యంలో గురువారం రాత్రి గడ్డి మందు తాగడంతో కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి తర్వాత మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం అందింది. మృతుడి అన్న దశరథరాముడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

■ మార్కాపురం జవహర్‌నగర్ కాలనీలో నివాసముండే నూతలపాటి చెన్నకేశవులు(30) కుటుంబ సమస్యల కారణంగా శనివారం సాయంత్రం ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. భార్య ఆగ్నేషా, కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడు ఉన్నత చదువు చదివాడు. ఇద్దరు పిల్లలున్నారు. కాగా ఇద్దరు యువకుల మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆదాయం దిగదుడుపు.. రైతు చావులే రెట్టింపు

● మోదీ పాలనలో సంక్షోభంలో వ్యవసాయం
● కార్మిక హక్కులు హరించేలా లేబర్ కోడ్‌లు దుర్మార్గం
● కార్మికులంతా ఏకంకండి.. సమ్మెకు కదిలిరండి
● వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల



సమ్మె కరపత్రం విడుదల చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

ఒంగోలు టౌన్: రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తాం, సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగాన్ని కాపాడతామని చెప్పిన మోదీ మాటలన్నీ నీటిలో మూటలయ్యాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు ధ్వజమెత్తారు. మోదీ కార్పొరేట్ అనుకూల పాలనతో వ్యవసాయ రంగం మరింతగా సంక్షోభంలో కూరుకుపోయిందని, కనీస ఆదాయం కూడా లేకపోవడంతో రైతులు ఆత్మహత్యలు రెట్టింపయ్యాయని నిప్పులు చెరిగారు. కార్మికుల హక్కులు కాపాడాలని, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 9న దేశ వ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెకు కర్షకులు, కార్మికులు కదిలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. శనివారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో సమ్మె కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కంకణాల మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను బలంగా తిప్పికొట్టేందుకు ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నో త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న 24 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ 4 లేబర్ కోడ్‌లుగా కుదించడం దుర్మార్గమన్నారు. కార్మికులకు సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు లేకుండా చేస్తున్నారని, లేబర్ కోడ్‌ల వల్ల 8 గంటల పని దినాన్ని కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడమే కాకుండా, ఉపాధి హామీ చట్టాన్ని సైతం నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెబుదామన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరసుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను రాష్ట్ర ప్రభుత్వం సమర్థించడం సిగ్గుచేటని విమర్శించారు. కార్మిక చట్టాలను ఒక్క కలం పోటుతో రద్దు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం నోరు మూసుకొని కూర్చోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు ఊసా వెంకటేశ్వర్లు, అన్నవరపు శేషారావు, కంకణాల వెంకటేశ్వర్లు, గడ్డం పిచ్చయ్య, గోగుల నారాయణ, ఉబ్బా వెంకటేశ్వర్లు, తలారి ఆదాం, జి.వందనం, ఎం.దాసు, టి.అంజిబాబు, గోపి తదితరులు పాల్గొన్నారు.

గోవా మద్యం స్వాధీనం



గిద్దలూరులో స్వాధీనం చేసుకున్న గోవా మద్యం

కంభం/గిద్దలూరు రూరల్: అక్రమంగా గోవా మద్యం తరలిస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు రెండు చోట్ల చిక్కినట్టే చిక్కి పారిపోయారు. గిద్దలూరు, కంభం ఎక్సైజ్ సీఐలు శనివారం తమ కార్యాలయాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు, మార్కాపురం ఏఈఎస్‌టీఎఫ్ సిబ్బందితో కలిసి ఆర్పీఎఫ్ అధికారుల సహకారంతో కంభం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించగా ఒక బ్యాగులో 4.7 లీటర్ల గోవా లిక్కర్ పట్టుబడింది. గుర్తు తెలియని నిందితుడు పారిపోయాడని ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి తెలిపారు. గిద్దలూరు రైల్వేస్టేషన్‌లో 7 గోవా మద్యం బాటిళ్లు సీజ్ చేశామని, నిందితుడు తప్పించుకున్నాడని స్థానిక ఎక్సైజ్ పోలీసులు చెప్పారు. ఒకే రోజు రెండు సంఘటల్లో నిందితులు పారిపోయారని చెప్పడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



కంభంలో సీజ్ చేసిన గోవా లిక్కర్‌తో ఎక్సైజ్ పోలీసులు

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన నారాయణ

కొత్తపట్నం: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృత్యువాతపడ్డాడు. ఈ సంఘటన ఈతముక్కల గ్రామంలో చెత్త సంపద తయారీ కేంద్రం వద్ద శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. టంగుటూరు మండలం వాసేపల్లిపాడు గ్రామానికి చెందిన దూడల నారాయణ(40) వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం ఈతముక్కలలో రొయ్యలు కొనుగులు చేసి తన బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. గ్రామ శివారులో రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రాక్టర్‌ను బైక్ అదుపు తప్పి ఢీకొనడంతో నారాయణకు బలమైన గాయాలై స్పృహ కోల్పోయాడు. స్థానికులు 108 అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించారు. ఎస్ఐ సుధాకర్‌బాబు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైతుల మాట అబద్ధం.. కాదు పోలీసులదే తప్పు!

త్రిపురాంతకం: ఓ భూవివాదం పోలీసులు, రైతుల మధ్య మాటల మంటలు రేపింది. పోలీసులు అన్యాయం చేస్తున్నారని రైతులు ఓ వీడియోలో ఆరోపించగా.. అదంతా తప్పుడు ప్రచారమంటూ పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం త్రిపురాంతకం పోలీస్ స్టేషన్‌లో సీఐ హసన్, ఎస్సై శివబసవరాజు విలేకర్లతో మాట్లాడారు. త్రిపురాంతకం మండలం దీవేపల్లి వద్ద తలెత్తిన భూ వివాదంలో ఇరువర్గాల వారి మధ్య ఘర్షణ వాతావరణం ఉందన్నారు. రైతులు తమవని చెబుతున్న భూములు వేరే వ్యక్తులపై రిజిస్టర్ అయి ఉన్నాయని చెప్పారు. వివాదం నెలకొన్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులకు తెలియజేశామన్నారు. ఈ భూ తగాదాపై కేసు నమోదు చేశామని, తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రైతుల వాదన ఇదీ..

రైతులు ఒక వీడియోను చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. గత 40 ఏళ్లుగా తాము సాగుచేసుకుంటున్న భూములను అన్యాయంగా ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని దివేపల్లికి చెందిన ఎస్.చెన్నయ్య, కొండయ్య, ఓబులు, నర్సమ్మ, దూపాడుకు చెందిన చెన్నయ్య, పుల్లయ్య, డేవిడ్ ఆరోపించారు. భూములు పోతే ఆత్మహత్యే శరణ్యమని పురుగు మందు బాటిళ్లతో హెచ్చరించారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు న్యాయం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరికీ తెలియకుండా సర్వే నంబర్ 881లో తుమ్మల వాగు పోరంబోకు భూమి 7.70 ఎకరాలను రిటైర్డ్ ఉద్యోగి భార్య, కుమారుడు శివకుమార్‌పై అసైన్‌మెంట్ చేసుకున్నారని చెప్పారు. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములపై హక్కు కల్పించాలని కోరారు.



భూమి వద్ద పురుగుమందు డబ్బాలతో రైతులు
